క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సింగరాజు పల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-1లో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికలకు 18 ఏళ్ల వయస్సు పూర్తయ్యేంత వరకు పెళ్లి చేయకూడదన్నారు. అనంతరం సింగరాజు పల్లె గ్రామంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు హరిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు నక్కా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన కె.లక్ష్మీశ్వేత సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, మూషికవాహన, శివతాండవం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, శంకర శశిధర, బాలా త్రిపుర సుందరి తదితర అష్టకాలకు, గీతాలకు మేధ, మోక్షశ్రీ, కీర్తి, కార్తిక, భవిష్య తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

ఆత్మకూరు: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలని ఏడీఏ ఆంజనేయ దుకాణాల యజమానులకు సూచించారు. శుక్రవారం మండలంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలతో స్థానిక ఎంపీడీఓ సమావేశ హాలులో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రికార్డులు, స్టాక్ రిజిస్టర్, బిల్లుల నిర్వహణ గురించి వివరించారు. అనుమతులున్న విత్తనాలు మాత్రమే విక్రయించాలన్నారు.

మున్సిపల్ మేనేజర్‌గా సుప్రూలత



సుప్రూలత

నందికొట్కూరు: మున్సిపల్ మేనేజర్‌గా సుప్రూలత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఎమ్మిగనూర్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై నందికొట్కూరు మున్సిపల్ మేనేజర్‌గా వచ్చారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనా సేకరణ విధానాన్ని చూపుతున్న వ్యవసాయ అధికారులు

పాములపాడు: ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించాలని డీఆర్‌సి ఏఓ హేమలత రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఏఓ ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ వేసుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

చాగలమర్రి: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఫోరం జిల్లా కన్వీనర్ డెన్నిజాన్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ కార్యచరణలో భాగంగా మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు పోస్ట్‌కార్డుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి తమ సమస్యలను తెలియజేస్తామన్నారు. మే రెండో వారం నుంచి ప్రతి జిల్లా కేంద్రంలో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



దర్గా లో దువా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లకాల్వ గ్రామంలో శుక్రవారం రాత్రి సీతారామాంజనేయ, లక్ష్మణసహిత, శ్రీదేవిభూదేవి సహిత చెన్నకేశవ, గణపతిస్వామి, అమ్మవార్ల ధ్వజప్రతిష్ట మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత చింతన అలవరుచుకోవాలని సూచించారు. కాగా ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసగౌడ్, సుబ్బారెడ్డి, దేశం తిరుపం రెడ్డి, పార్టీ వెలుగోడు మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ సభ్యులు విజయ్‌చౌదరి పాల్గొన్నారు.

రోఖియాబీ దర్గాలో శిల్పా ప్రత్యేక ప్రార్థనలు

వెలుగోడు: మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రోఖియాబీ ఉరుసులో పాల్గొన్నారు. దర్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దువా చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ ఇలియాస్‌ఖాన్, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

మహానంది: గాజులపల్లె మాజీ సర్పంచ్ వి.రామకృష్ణుడు(గాజులపల్లె కిట్టు), ఎంపీటీసీ వడుగూరి లక్ష్మీదేవి దంపతుల కుమారుడు భరత్ వివాహ వేడుకకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. శాలివాహన సత్రం కళ్యాణ వేదిక వద్ద జరిగిన వివాహానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం శిల్పా చక్రపాణిరెడ్డి తమ్మడపల్లె గ్రామానికి చేరుకుని ఇటీవల మృతి చెందిన సర్పంచ్ చాబోలు సాలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పక్షవాతంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవరశెట్టి సుబ్బయ్యను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రుద్రమూర్తికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ఈశాన్య భాగంలోని రుద్రవనంలో ఉన్న రుద్రమూర్తికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. రుద్రమూర్తికి అభిషేకం నిర్వహించారు. అర్చకులు రుద్రమంత్రాలను పఠిస్తుండగా పంచామృతాలతో, గంధోధకం, భస్మోధకం, పుష్పోధకం, బిల్వోధకం, సుగంధోదకాలతో, జలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రదేవునికి బిల్వార్చనను జరిపి పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఏఈఓ ఇ.చంద్రశేఖర రెడ్డి, ఈఈ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



రుద్రమూర్తికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



ఊయలసేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించి అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

కౌలుకార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు

కొత్తపల్లి: కౌలు రైతులు తప్పకుండా కౌలు కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇతరుల పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు కౌలుకార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్డు ఉంటేనే అన్నదాసుఖీభవ, పంటనష్ట పరిహారం, కౌలు రుణాలు, పంటలకు మదతు ధర తదితర పథకాలు అమలు అవుతాయన్నారు. అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటు సారా స్వాధీనం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణాపురం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన 10 లీటర్ల నాటు సారాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన ముర్తుజావలి కొంత కాలంగా గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పోటెత్తిన భక్తులు

మహానంది: మహానంది ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. పెళ్లిముహూర్తాలు ఉండటంతో పాటు వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో సందడి నెలకొంది.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలో పింఛన్ల పంపిణీ శుక్రవారం కొనసాగింది. రెండోరోజు సాయంత్రానికి 97.47 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు

రుద్రవరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో విశ్వం పూజారికి చెందిన ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పూజారి మొదటి అంతస్తులో విద్యుత్ ఇస్త్రీ పెట్టె ద్వారా బట్టలను ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఆ ఇస్త్రీ పెట్టెను అలాగే వదిలేసి కిందికి వచ్చాడు. కాసేపటికి తిరిగి విద్యుత్ సరఫరా వచ్చింది. అయితే అది పట్టించుకోకుండా ఆయన కింది ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నారు. ఇంతలో ఇస్త్రీ పెట్టే అధికంగా వేడెక్కి పక్కనే ఉన్న దుస్తులు అంటుకొని మంటలు చెలరేగాయి. ఆలస్యంగా గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయితే దట్టమైన పొగ కారణంగా పలికి ఎవరూ వెళ్లలేకపోయారు. ప్రమాదంలో సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

బండి ఆత్మకూరు: తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, మండల వ్యవసాయ అధికారి స్వాతి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, ఎంపీటీసీలు ముంతల మధురాణి, అర్జున్, వెంకటమ్మ, కో ఆప్షన్ సభ్యులు దూదేకుల జమాల్, సర్పంచులు కాల్లూరి శ్వేతకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

పందుల బెడద

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం, పారుమంచాల, జూపాడుబంగ్లా గ్రామాల్లో పందుల బెడదతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారుమంచాల, పి.లింగాపురం గ్రామాల్లో పందులు ఏకంగా ఇళ్లల్లోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులు ఇళ్లముందు పరిసరాలను అపరిశుభ్రం చేస్తుండటంతో దుర్వాసన వస్తూ దోమలు వ్యాస్తున్నాయన్నారు. దోమల వ్యాప్తితో విషజ్వరాలు, అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయని పారుమచాల, పి.లింగాపురం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా, పారుమంచాల గ్రామాల్లో సమీపంలోని పొలాల్లోకి వెళ్లి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. మందులను బెదిరించేందుకు యత్నిస్తే మీదకు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయమై అనేక మార్లు ఎంపీడీఓ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పందుల బెడద నుంచి విముక్తి కలిగించటం లేదని ఆయా గ్రామాల్లోని ప్రజలు, రైతులు పేర్కొంటున్నారు. జిల్లా అధికారులైనా చర్యలు తీసుకొని పందులబెడదనుంచి విముక్తి కలిగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



పారుమంచాలలో సంచరిస్తున్న పందులు

వేలంలో ఆలయానికి ఆదాయం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి చెందిన భూములు కౌలు హక్కుల కోసం శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో రూ.1.03 లక్షలు ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. కొన్ని సర్వేనంబర్లకు వేలం పాట వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అలాగే తలనీలాలు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాముల గ్రామోత్సవం

ఆత్మకూరు రూరల్: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో సీతారామాంజనేయ, లక్ష్మణ, భూదేవి సహిత చెన్నకేశవస్వామి, గణపతి స్వాములు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు శుక్రవారం అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉదయం పూజాదీక్షా హోమంతో మొదలైన కార్యక్రమాలు మహాస్నపనము, 108 కలశాలతో అభిషేకాదులు, హారతి, మంత్ర పుష్పం జరిపించారు. మధ్యాహ్నం నుంచి మూలవిరాట్ స్వాములకు గ్రామోత్సవం నిర్వహించమచారు. సాయంత్రం దీక్షా హోమం, ధాన్యాధివాసం, కళాన్యసనం, నైవేద్యం, హారతి, యంత్ర పుష్పం, వేదస్వస్తి తదితర పూజలు చేపట్టారు. చివరి రోజు శనివారం విగ్రహ ప్రతిష్ఠతో కార్యక్రమం ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.



గ్రామోత్సవంలో మూలవిరాట్‌లు

నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం కోళ్లబావాపురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సుభాసిని తనిఖీ నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న కావేటి పార్థసారథి వద్ద 5 లీటర్లు, బద్దెటి సుంకన్న వద్ద 5 లీటర్ల నాటు సారానను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కృపవరకుమారి, శంకర్ నాయక్, రామాంజనేయులు, పోలీసులు శివన్న, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, ప్రసాద్, అల్లస్వామి, అర్చన ఉన్నారు.



నాటుసారాను చూపుతున్న అధికారులు

మేఘం మెరిసెన్!

మహానంది మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆలయ పరిసరాలతో పాటు చుట్టుపక్కల భారీగా గాలులు, ఉరుములు, మెరుపులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మెరుపులు ఆకాశంలో నాట్యమాడాయి.

– మహానంది



శ్రమ జీవుల సేద్యమే దేశానికి నిజమైన సంపద



జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఆత్మకూరు: శ్రమ జీవుల సేద్యమే దేశానికి నిజమైన సంపద అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నరసింహానాయక్, జిల్లా నాయకులు ఎ.రణధీర్ అన్నారు. శుక్రవారం మే డేను పురస్కరించుకుని నల్లకాలువ గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పని కోసం, కార్మిక హక్కుల కోసం, సరైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. మే డే అనేది కేవలం సెలవు రోజు మాత్రమే కాదని, కార్మికుల సామాజిక, ఆర్థిక హక్కుల కోసం నిరంతరం కృషి చేయడానికి ఒక పిలుపు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు, డి.రామ్‌నాయక్, వీరన్న, గ్రామ సీనియర్ నాయకులు రాముడు, హమాలీ కార్మికులు రామ్‌నాయక్, ఎల్లయ్య, వినోద్, సూరిబాబు, శ్రీనివాసనాయక్, తరుణ్, చంద్రకాంత్, బజారయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన అవసరం





అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజరు రేణుకాదేవి, మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లలిత ప్రభావతి

నందికొట్కూరు: కౌమారదశ బాలికలకు సాధికారతపై అవగాహన ఎంతో అవసరమని మిడుతూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మిడుతూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమాలు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ వరకు కౌమారదశ బాలికల సాధికారత గురించి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కిశోర బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు.


వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని గ్రామ సర్పంచు నవీన్, హెచ్ఎం శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణా శిబిరం ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచు, హెచ్‌ఎం

ఘనంగా శంకర జయంతి





పూజలందుకున్న శంకరస్వామి, మహానందిలో ఆదిశంకరాచార్యుల జయంతి పూజలు చేస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా శుక్రవారం ఆది శంకరుల జయంతి ఘనంగా నిర్వహించారు. పాలధార-పంచధార వద్ద ఉన్న శంకర మందిరంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు, వేదపండితులు మహాగణపతిపూజ జరిపారు. అనంతరం వేదమంత్రాలతో చంద్రమౌళీశ్వరస్వామివారికి, శారదాదేవికి, శంకరుల వారికి విశేషంగా అభిషేకం జరిపించారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో..

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆదిశంకరాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపం వద్ద ఆదిశంకరుల జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి శుక్రవారం అధికారులు పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు, రక్షణ కల్పించేందుకు, దేవస్థానం ఆస్తులకు భద్రత తదితర విషయాలపై సీఐ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, జిల్లా సెక్యూరిటీ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ శిక్షణ ఇచ్చారు. ఉత్సవాల సమయంలో రోప్ పార్టీ విధులు, పెట్రోలింగ్ విధానం, మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితులను, సీసీ కెమెరా సర్వేలెన్స్, అగ్నిమాపక పరికరాల వినియోగం, ఇన్సిడెంట్ రిపోర్టింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.



రోప్ పార్టీ విధులపై శిక్షణ ఇస్తున్న అధికారులు